క్లుప్తంగా

వైద్యుడు గుణశేఖర్ సేవలు ప్రశంసనీయం

పోలవరం రూరల్: పోలవరం సీహెచ్‌సీలో పని చేస్తున్న చిన్న పిల్లల వైద్యులు గుణశేఖర్ అత్యుమ సేవలు అందించినందుకు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ పాల్ సతీష్ చేతుల మీదుగా ఆయన ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. పాల్ సతీష్ మాట్లాడుతూ చిన్న పిల్లలకు నిరంతరం సేవలు అందిస్తూ వైద్య రంగంలో అంకితభావంతో పనిచేస్తున్న గుణశేఖర్ సేవలు ప్రశంసనీయమని అన్నారు. అవార్డు గ్రహీతను వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది అభినందించారు.

జాతీయ నాయకుల విగ్రహాల ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: శోభనాద్రిపురంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం కొప్పుల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంఈవో బి.రాముడు, జి.రాములు పాల్గొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి, గాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణన్, భగత్‌సింగ్ విగ్రహాలను వారు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు ఎం.విజయరేఖ, ఎస్ఎంసీ ఛైర్మన్ బి.రమ, వైస్‌చైర్మన్ టి.ప్రభుత్వ, సర్పంచ్ వి.సత్యవతి, ఎంపీటీసీ ఎన్.సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

కొయ్యలగూడెం: ఏలూరు జిల్లా ఉత్తమ ఎలక్ట్రోల్ అధికారిగా అవార్డు అందుకున్న కొయ్యలగూడెం తహసీల్దార్ కె.చెల్లన్నదొర అభినందన, సన్మాన కార్యక్రమం ఆదివారం కార్యాలయంలో నిర్వహించారు. రెవెన్యూ అసోసియేషన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో పాటు ప్రజా సంఘాల నాయకులు హాజరై తహసీల్దార్‌ను పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. విజయవాడలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. దీనిని పురస్కరించుకొని అభినందన కార్యక్రమంలో నిర్వహించారు. జిల్లాలోని బెస్ట్ ఎలక్ట్రోల అధికారిగా తహసీల్దార్ ఎంపిక కావడం కొయ్యలగూడెం మండల వాసులకు గర్వకారణంగా నిలిచిందని జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడు అడప రాంబాబు పేర్కొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీకృష్ణ దేవరాయ కాపు కల్యాణ మండపంలో ఆదివారం పలువురు విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు పుస్తకాలు, పెన్నులు ఇతర పరీక్ష సామగ్రిని అందజేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వీటిని అందించినట్టు ట్రస్టు వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్యాణ మండప స్థల దాత పెద్దిరెడ్డి వేణుగోపాలకృష్ణారావు, ట్రస్టు సభ్యులు మైగాపుల మోహన్‌రావు, కాపు సంఘం పట్టణ అధ్యక్షుడు రుద్ర శివాజీ, మండల అధ్యక్షుడు పుప్పాల మురళీ, ఉక్కుర్తి వెంకట్రావు, గువ్వల నాగబాబు, కుర్రి సతీష్ తదితరులున్నారు.

కొత్త చట్టాలను రద్దు చేయాలి



కొత్త చట్టాలను రద్దు చేయాలని కోరుతూ పోలవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: వ్యవసాయాన్ని కార్పొరేటీకరించే, రైతు మెడకు ఉరితాడు బిగించే కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలను రద్దు చేయాలని, ఏప్రిల్ 1 నుంచి నాలుగు లేబర్ కోడ్ల అమలును నిలుపుదల చేయాలని రైతు కూలీ సంఘం (ఏపీ), ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోలవరంలో నిరసన ప్రదర్శన చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా– కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా రైతు కూలీ సంఘం (ఆంధ్ర), ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోలవరంలో ప్రదర్శన నిర్వహించి, ఏటిగట్టు సెంటర్లో నిరసన తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ ఢిల్లీలో రైతాంగం పెద్ద ఎత్తున పోరాడినప్పుడు రైతాంగ సమస్యలన్నీ పరిష్కరిస్తానని నరేంద్ర మోడీ వాగ్దానం చేసి నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ అమలు చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు సవలం రాంబాబు మాట్లాడారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు దాడి రాముడు, మిడియం రవి దొర, మీడియం పోసిరావు నాయకత్వం వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

బుట్టాయగూడెం: సుమారు రూ.కోటి వ్యయంతో బుట్టాయగూడెంలో ఏర్పాటు చేసిన 8 ఎమ్‌వీఏ కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఎమ్మెల్యే చిర్రిబాలరాజు, నాయకులు కరాటం రెడ్డి బాబు, కరాటం సాయిబాబాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ గతంలో బుట్టాయగూడెం, సబ్‌స్టేషన్ పరిధిలో గృహాలకు, వ్యవసాయానికి సంబంధించి ఆయా గ్రామాలకు సరఫరా చేసేందుకు 5 మెగా వాట్ల యాంప్‌తో ట్రాన్స్‌ఫార్మర్ ఉండేదన్నారు. గృహ, వ్యవసాయానికి విద్యుత్ వినియోగం మరింత పెరగడంతో లోవోల్టేజి సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని పెంచినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణతంత్ర వేడుకలు

- అంబరాన్నంటిన సంబరాలు
- ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు అందజేత
- ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో జెండా వందనాలు

వాడవాడలా ముువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం అట్టహాసంగా జరుపుకున్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. గ్రామ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



కుక్కునూరు: అటవీశాఖ కార్యాలయంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న రేంజర్ కృష్ణకుమారి



చింతలపూడి: తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో ఆర్డీవో ఎంవీ రమణ జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్లీవజోజి, ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణంలో జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్‌వీ తేజస్వి, బార్ సభ్యులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎంవీ రమణ జాతీయ జెండాను ఎగురవేయగా, ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన బత్తిన లక్ష్మి, వైస్‌చైర్మన్లు కంచర్ల వాసవీరత్నం, ముప్పిడి అంజి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ యు.రవిచంద్ర త్రివర్ణపతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణబాబు, ఎస్సై జబీర్, సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, రవాణా శాఖ కార్యాలయంలో, మసీదు వద్ద ఆర్టీవో ఎండీ మదని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ రంగనాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరంలో..

పోలవరం రూరల్: పోలవరం మండలం పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, పోలవరం ప్రాజెక్టు డివిజన్ కార్యాలయం వద్ద ఈఈ వెంకటరమణ, రెవెన్యూ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీను, పెన్షనర్స్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు జీవీవీ సత్యనారాయణ, శాఖా గ్రంథాలయం వద్ద గ్రంథాలయాధికారి జె.సుబ్రహ్మణ్యం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసరావు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడారు.

జాతీయ నాయకులకు ఘన నివాళి

లింగపాలెం: స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ యండీ నజిముల్లాషా, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె వాణి, ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కె వెంకన్న మహాత్మగాంధీ, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ధర్మాజీగూడెంలోని శ్రీవిద్యా, అనన్య స్కూల్లో జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంఈఓ కె రామారావు,వీఆర్వోలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల తహసీల్దార్ కార్యాలయం వద్ద

ద్వారకాతిరుమల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో పీవీవీ ప్రకాష్, రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ జేవీ సుబ్బారావు, శ్రీవారి దేవస్థానం వద్ద డిప్యూటీ ఈఓ బాబూరావు, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై టి.సుధీర్, శ్రీవేంకటేశ్వర శ్రీకృష్ణ దేవరాయ కాపు కల్యాణ మండపం వద్ద ట్రస్ట్ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, గ్రంథాలయం వద్ద గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ బొండాడ సావిత్రి, ఎంపీటీసీ రుద్ర నాగ సూర్యకళ, రుద్ర శివాజీ తదితరులున్నారు.

జాతీయ జెండాతో ర్యాలీ

కుక్కునూరు: స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ రమేష్, పోలీస్‌స్టేషన్‌లో సీఐ రమేష్‌బాబు, అటవీశాఖ కార్యాలయంలో రేంజర్ కృష్ణకుమారి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నరసింహరావు జాతీయ జెండావిష్కరణ చేశారు. కుక్కునూరు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు జాతీయ జెండాతో కుక్కునూరు ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ చేశారు.

గిరిజనుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కృషి

బుట్టాయగూడెం: గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె. రాముల నాయక్ అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో ఆదివారం గణతంత్ర వేడుకలు ఐటీడీఏలో ఘనంగా నిర్వహించారు. పీఓ రాములనాయక్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

దేశ పౌరులంతా ఐక్యంగా ఉండాలి

చింతలపూడి: దేశ పౌరులంతా ఐక్యంగా ఉండి దేశ సార్వభౌమత్వాన్ని రక్షించుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయం వద్ద, సొసైటీ కార్యాలయం, వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయాల వద్ద సంబంధిత అధికారులు ఆదివారం జాతీయ పతాకావిష్కరణ చేశారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: గణతంత్ర వేడుకల సందర్భంగా ఆదివారం స్థానిక కార్యాలయం వద్ద తహసీల్దార్‌కి చెల్లన్న దొర జాతీయ పతాకావిష్కరణ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద, ఈఓపీఆర్డీ (ఇన్‌చార్జ్) హోదాలో జాతీయ జెండా ఎగురవేశారు. డివిజన్ ఇరిగేషన్ కార్యాలయం గణతంత్ర వేడుకలు నిర్వహించారు.



లింగపాలెం: రెవెన్యూ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ నజిముల్లాషా



ద్వారకాతిరుమల: తహసీల్దార్ కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకల్లో ఎంపీపీ మోహిని, జెడ్పీటీసీ శామ్యూల్



కొయ్యలగూడెం: తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ



జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కస్తున్న కమిషనర్

గౌరవ వందనం స్వీకరించిన డీఎస్పీ



కామవరపుకోట: తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో గౌరవం వందన స్వీకరిస్తున్న డీఎస్పీ రవిచంద్ర

కామవరపుకోట: స్థానిక తడికలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఎంపీడీఓ ఎం.సరళకుమారి తన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కొండగూడెం సీఎస్ఐ పరిశుద్ధ పేతురు దేవాలయంలో రెవరెండ్ జాన్ రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో తడికలపూడి ఎస్సై చెన్నారావు, ఏవో సత్యవేణి, ఎంపీఈఓలు సుబ్బారావు, ప్రశాంతకుమార్ పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం విజయదుర్గమ్మ ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూలా జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించామన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

జగన్ ఆశయ సాధనకే పాదయాత్ర

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల సాధనకే పాదయాత్ర చేపట్టినట్లు ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పరింపూడిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు పార్టీ శ్రేణులతో కలిసి ప్రసాద్ చేపట్టబోయే పాదయాత్ర విజయవంతం కావాలంటూ అభినందన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఏలూరు పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కాకినాడ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు దుర్గాప్రసాద్ తెలిపారు. నిరుద్యోగుల భవిత కోసం తాను చేపట్టబోయే పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి పార్టీలకు అతీతంగా మద్దతు లభిస్తుందని అన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని అధినేత జగన్, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా అభినందనలు తెలిపారన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నలుమూలల నుంచి పార్టీలకతీతంగా ప్రాంతాలకతీతంగా ఉద్యోగ ఉపాధ్యాయులు నిరుద్యోగులు మిత్రులు అందరూ వచ్చి నాకు సంఘీభావం తెలపాలని ఆయన కోరారు. ఏలేటి చంద్రం, కంభంపాటి బుజ్జిబాబు, దూలపల్లి కాంతారావు, చిటికెన నాగార్జున, చిడిపి రవి, తొంటా వాసు, చీమకుర్తి సత్యనారాయణ, బొమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో చిక్కాల దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

యథేచ్ఛగా మాంసం, చేపల విక్రయాలు

ద్వారకాతిరుమల: స్థానిక సంత మార్కెట్‌లో గణతంత్ర దినోత్సవం రోజు సైతం మాంసం, చేపల విక్రయాలు యథేచ్ఛగా కొనసాగాయి. ఆదివారం వ్యాపారులు బహిరంగంగా వీటిని విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. సంబంధిత అధికారులు సైతం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. దాంతో మాంసం, చేపల విక్రయాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని స్థానికులు ధ్వజమెత్తారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డుపై హర్షం

చింతలపూడి: ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించడంపై స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ మందకృష్ణ చేసిన సేవలను, పోరాటాలను గుర్తించి పద్మశ్రీ అవార్డు ప్రకటించటంపై రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆతుకూరి సుబ్బారావు, ముప్పిడి సామ్యూల్, సంధిపాం కిరణ్, కాటూరి ఏలియా, గంధం రాంబాబు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధికి కృషి

బుట్టాయగూడెం: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కేతావతు రాముల నాయక్‌ను ఏపీ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పకుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్‌లో అనేక శాఖల్లో సెక్షన్ అధికారిగా పనిచేసిన రాములనాయక్ పీఓగా రావడం సంతోషంగా ఉందన్నారు. ఆయనకు ఉన్న అనుభవంతో ఐటీడీఏకు నిధులు రాబట్టి ఈ ప్రాంత ఆదివాసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చెయ్యాలని కోరారు. జీఓ నంబర్ 57 ద్వారా ఆదివాసీల సంక్షేమ అభివృద్ధికి కృషి చెయ్యాలని కోరారు.

ధాన్యం రవాణా చార్జీలను చెల్లించాలి

లారీ ఓనర్ల ఆందోళన

చింతలపూడి: ప్రభుత్వం లారీ ఓనర్లకు ధాన్యం రవాణా చార్జీలను తక్షణం చెల్లించాలని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉక్కుర్తి నాగేశ్వరావు డిమాండ్‌చేశారు. చింతలపూడిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ 2024–2025 ఖరీఫ్ సీజన్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి లారీ ఓనర్లు ధాన్యం రవాణా చేశారని, డీజిల్‌తో పాటు లోడింగ్, అన్‌లోడింగ్, హమాలీ చార్జీలు వారంతా తమ సొంత డబ్బులతో చెల్లించారన్నారు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి తీసుకోకుండా అధికారుల ఆదేశాల మేరకు రైతులకు ఇబ్బంది లేకుండా సివిల్ సప్లై, అగ్రికల్చర్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ధాన్యం రవాణా చేసినట్టు లారీ వానర్లు అన్నారు. సివిల్ సప్లై అధికారులు, ప్రభుత్వం లారీ ఓనర్లకు ఇప్పటివరకు ఎలాంటి రవాణా చార్జీలు చెల్లించలేదని వాపోయారు. ధాన్యం రవాణా చేసిన డబ్బులు అందక నెలవారీ వాహనం రుణానికి సంబంధించిన వాయిదాలు కట్టలేక, డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేక లారీ ఓనర్ల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం జనవరి నెల రోడ్ ట్యాక్స్ కట్టాలని వాపోయారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ధాన్యం రవాణా చేసిన చార్జీలను త్వరగా చెల్లించాలని, లేని పక్షాన లారీ ఓనర్లు కుటుంబాలతో కలెక్టరేట్‌ని ముట్టడించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రమణ, సెక్రెటరీ తొమ్మండ్రు శీను, జాయింట్ సెక్రెటరీ మోరంపూడి శ్రీను, ట్రెజరర్ ఉయ్యూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



చింతలపూడిలో ధాన్యం రవాణా చార్జీలను చెల్లించాలని కోరుతున్న లారీ ఓనర్లు

సారా తయారీ కేంద్రాలపై దాడి

కుక్కునూరు: వేలేరులోని నాటుసారా తయారీ కేంద్రాలపై ఆదివారం కుక్కునూరు పోలీసులు దాడులు చేశారు.ఈ దాడుల్లో 500 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా నాటుసారా తయారు చేసినా, అమ్మినా చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని కుక్కునూరు సీఐ రమేష్‌బాబు హెచ్చరించారు.

ఎక్సైజ్ దాడులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన దాడుల్లో మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. అతని వద్ద నుంచి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



కుక్కునూరు: బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పోలవరం రూరల్: పోలవరం ఎక్సైజ్ సర్కిల్‌పరిధిలో ఆదివారం డ్రైడే రైడ్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జిల్లెళ్లగూడెంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. దాడుల్లో ఎస్సై ఎల్.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళ అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే శోభనాద్రిపురానికి చెందిన చుంద్రు సుబ్బారావుకు, భవానీకి ఏడేళ్ల క్రితం వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. వ్యవసాయం చేసుకుని వారు జీవిస్తున్నారు. ఈ నెల 22వ తేదీ రాత్రి సుబ్బారావు, భవానీ, పిల్లలు భోజనం చేసి పడుకున్నారు. 23వ తేదీ ఉదయం లేచి చూసేసరికి భవానీ కనిపించలేదని, చుట్టుపక్కల వెదికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం సుబ్బారావు ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టీడీపీ నాయకుడి తీరుపై విమర్శల వెల్లువ

గణతంత్ర వేడుకల వేదిక వద్ద పుట్టిన రోజు సంబరాలు

ద్వారకాతిరుమల: గణతంత్ర దినోత్సవం సాక్షిగా జాతీయ పతాకానికి అవమానం జరిగింది. జెండా వందనం జరిగిన ప్రాంతంలోనే టీడీపీ నేత పుట్టిన రోజు వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపు వర్ణం, పార్టీ సింబల్‌తో ఉన్న కేక్‌ను కట్ చేయడం వివాదాస్పదమైంది. ఈ ఘటన ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాలలో ఆదివారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండా వందనం నిర్వహించిన వెంటనే ఆ ప్రాంతంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఓం ప్రకాష్ చౌదరి పుట్టినరోజు వేడుకలను నిర్వహించి పార్టీ రంగు కేక్‌ను కట్ చేయడం చర్చనీయాంశమైంది. ఉపాధ్యాయులకు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులకు, పార్టీ శ్రేణులకు ఈ కేక్‌ను పంపిణీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. జాతీయ పతాకాన్ని గౌరవించుకున్న ప్రదేశంలో గణతంత్ర వేడుకల అనంతరం పిల్లలను వేచి ఉంచి పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం సరికాదని పలువురు విమర్శిస్తున్నారు.



ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాలలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు నిర్వహణ

ఎన్‌పీఎఫ్‌ఏఎం చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

జంగారెడ్డిగూడెం: వ్యవసాయ వ్యతిరేక మార్కెటింగ్ జాతీయ విధాన చట్టం (ఎన్‌పీఎఫ్‌ఏఎం) ఉపసంహరించుకోవాలి అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోరండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అఖిల భారత కిసాన్ మజ్దూర్ సంఘ్, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా జంగారెడ్డిగూడెంలో రైతు. వ్యవసాయకూలీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన సభలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోరండ్ల శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు షేక్ సుభాని, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కుంచె వసంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పరం చేయడం కోసం తీవ్రంగా ప్రయత్నం చేస్తోందన్నారు. దీన్ని కేంద్ర రైతు సంఘాలు, కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ నూతన చట్టం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు భారత వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే ఈ నూతన చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మానుకొండ జీవరత్నం, సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణ రాజు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కారం రాఘవులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సూర్యారావు, రైతు సంఘాల నాయకులు వడ్లమూడి వెంకటేశ్వరరావు, వి.సద్గురు, ఎస్.బాల యేసు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో ఎన్‌పీఎఫ్‌ఏఎం చట్టాన్ని ఉపసంహరించాలని కోరుతూ ర్యాలీ